క్లుప్తంగా

ఫోర్త్‌టౌన్ క్రైం ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న క్రైం ఎస్‌ఐ రామ్మోహనరావు

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ క్రైమ్ ఎస్‌ఐగా రామ్మోహనరావు బాధ్యతలు స్వీకరించారు. 'సాక్షి' దినపత్రికలో 'క్రైం ఎస్‌ఐ కావలెను' శీర్షికన ఏప్రిల్ 1వ తేదీన వార్త ప్రచురితమయింది. దీంతో పోలీస్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు శనివారం ఫోర్త్‌టౌన్ క్రైం ఎస్‌ఐగా రామ్మోహనరావును నియమించారు. 1989 బ్యాచ్‌కు చెందిన ఆయన కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరారు. అనకాపల్లిలో ఏఎస్‌ఐ నుంచి ఎస్‌ఐగా ప్రమోషన్ పొందారు. అంచెలంచెలుగా ఎదిగి ఎస్‌ఐగా ప్రమోషన్‌తో విశాఖకు బదిలీపై వచ్చారు. సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

వాకర్స్ వైద్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న వి హెల్త్‌కేర్, వి డెంటల్ కేర్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: బెస్ట్ ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వి హెల్త్ కేర్, వి డెంటల్ కేర్ సహకారంతో శనివారం రైల్వే గ్రౌండ్స్‌లో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వి హెల్త్ కేర్ డైరెక్టర్ కేఎంకే రమేష్ వాకర్లకు ఆరోగ్య విషయంలో పలు సూచనలు చేశారు. ఆరు నెలలకు ఒకసారి విధిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. నోటి పరిశుభ్రత, దంతాల అమరిక సరైన రీతిలో ఉన్నవారికి బెస్ట్ స్మైల్ అవార్డులు ప్రదానం చేశారు. బీపీ, షుగర్, ఊపిరితిత్తులు, దంతాలు పరీక్షించారు. వి డెంటల్ కేర్ డెంటిస్ట్ డాక్టర్ వి. స్వర్ణలత, క్లినిక్ హెడ్ సీహెచ్ కృష్ణచైతన్య, సిబ్బంది లతీష, శైలజ, భారతి, లిఖిత్, సామాజిక సేవకులు బీఎల్ నారాయణ, బెస్ట్ ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వై. పరసయ్య, సెక్రటరీ డి. తారకేశ్వరరావు, ప్రతినిధులు కె. వేణుగోపాలరావు, జె. సూర్యనారాయణ, సీహెచ్ సుందర్, వి. సూరిబాబు, కేవీఆర్ మూర్తి, పి. దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ తనిఖీ



రైతుబజారులో టమాటాలను పరిశీలిస్తున్న డీటీఎం షేక్ యాసిన్

సీతమ్మధార: స్థానిక రైతు బజార్‌ను శనివారం జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న టమాటాలను పరిశీలించారు. ఒక రైతు వద్ద టమాలు బాగులేకపోవడంతో అధికారి రైతును హెచ్చరించారు. టమాటాలు విక్రయిస్తున్న కౌంటర్లను, రైతుల ఐడీ కార్డులను పరిశీలించారు. వినియోగదారులకు ఇబ్బంది లేకుండా విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి, సహాయకుడు సతీష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సవరణ బిల్లుతో ముస్లింలకు తీవ్ర నష్టం



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బర్కత్ అలీ, షేక్ బాజ్జీ

మద్రిపాలెం: పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుతో ముస్లింలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని విశాఖ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు, 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ అన్నారు. శనివారం పార్టీ వార్డు కార్యాలయంలో నియోజకవర్గం సమాచార హక్కు చట్టం అధ్యక్షుడు షేక్ బాజ్జీతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. సవరణ బిల్లును రద్దు చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. షేక్ బాజ్జీ మాట్లాడుతూ సవరణ బిల్లు వల్ల ముస్లింలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. సమావేశంలో చేతికి నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు.

కథ చెబుతాను ఊ.. కొడతారా..

- పౌర గ్రంథాలయంలో ప్రతి నెలా 1, 3 ఆదివారాలు స్టోరీ టెల్లింగ్
- మూడు సంవత్సరాలుగా ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు
- పిల్లల్లో భాష, సంస్కృతీ సంప్రదాయాల పునరుద్ధరణకు చక్కటి ప్రయత్నం



చిన్నారులు తయారు చేసిన పేపర్ లాంతర్లు



తమ డ్రీమ్స్‌ను బెలూన్స్‌పై ప్రదర్శిస్తున్న పిల్లలు

సీతంపేట: పూర్వం పిల్లలకు కథలే కాలక్షేపం. అన్నం తినడానికి మారాం చేసే పిల్లలకు బామ్మ, తాతయ్యలు కథలు చెప్పి బుజ్జగించేవారు. పడుకునే ముందు కథ చెబితే గాని పిల్లలు నిద్రలోకి జారుకునే వారు కాదు. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. ఉరుకులు పరుగుల జీవితంలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పిల్లలకు కథలు చెప్పడం మాట దేవుడెరుగు.. కనీసం పిల్లలతో కాసేపు మనసు విప్పి మాట్లాడే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో టీవీలో కార్టూన్ ఛానల్స్, మొబైల్ ఫోన్‌లో గేమ్స్, ఇన్‌స్టాలో రీల్స్‌కు పిల్లలు అలవాటు పడ్డారు.

నీతి కథలతో మేలు..

పిల్లలకు నీతి కథలు బోధించడం వల్ల మంచి, చెడు విచక్షణ, ధర్మం, అధర్మం, న్యాయాన్యాయాలు, సమయస్ఫూర్తి, వివేకం, విజ్ఞానం, నైతిక విలువలు, మంచి నడవడిక, సంస్కారం వస్తుంది. అప్పట్లో పిల్లల కోసం చందమామ, బాలమిత్ర వంటి కథల పుస్తకాలు ప్రచురితమయ్యేవి. దాదాపు అందరి ఇళ్లలో కథల పుస్తకాలు ఉండేవి. పెద్దలు చెప్పే కథలు వినడం, కథల పుస్తకాలు చదవడం ద్వారా పిల్లలకు ఎలా నడుచుకోవాలో, ఏ సమయంలో ఎలా వ్యవహరించాలో తెలిసేది. ఇప్పటి పిల్లలు వాటన్నింటికి దూరం అవుతున్నారు. మరల ఆ పాత రోజులు వచ్చేలా విశాఖ పౌర గ్రంథాలయం, విద్యాభవన్స్ స్కూల్ సంయుక్తంగా కృషి చేస్తున్నాయి. గత మూడేళ్లుగా ప్రతి నెలా మొదటి, మూడవ ఆదివారాల్లో పబ్లిక్ లైబ్రరీలో స్టోరీ టెల్లింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.



పాట పాడుతూ కథ చెబుతున్న స్టోరీ టెల్లర్ సీతా శ్రీనివాస్



ఆసక్తిగా కథ వింటున్న చిన్నారులు

మార్గదర్శకంగా కథల బోధన..

ప్రముఖ స్టోరీ టెల్లర్ సీతా శ్రీనివాస్ తనదైన శైలిలో పిల్లలను ఆకట్టుకునేలా కథలు చెబుతున్నారు. జానపద కథలు, వివిధ దేశాలు, రాష్ట్రాలకు చెందిన సాంప్రదాయ కథలు, అక్కడి సంస్కృతి, వారి జీవన శైలి, ఆచార వ్యవహారాలు, అలవాట్లు కథల ద్వారా పిల్లలకు బోధిస్తున్నారు. మ్యూజిక్, రిథమ్ అండ్ మువ్‌మెంట్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, హ్యూమర్, బిహేవియర్, అనాలసిస్ వంటి కార్యక్రమాల ద్వారా కథలోని ప్రముఖ పాత్రను క్రాఫ్ట్, వర్క్‌షీట్స్, డ్రాయింగ్, ఒరగామి చేయిస్తున్నారు. ఈ విధమైన కథల ద్వారా పిల్లల్లో ఒకాబులరీ, జనరల్ నాలెడ్జి అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. పిల్లలు ఇంగ్లీష్‌లో ఎక్కువగా కథలు వినడం ద్వారా భాషపైన పట్టు, ఇష్టం, బుక్ రీడింగ్‌పై ఆసక్తి, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందిస్తున్నారు.



పీకాక్ బొమ్మ చూపిస్తున్న పిల్లలు

కథల పుస్తకాలు చదివించండి..



గత 15 ఏళ్లుగా పిల్లలకు కథలు బోధిస్తున్నాను. జానపదాలు, ఇండియన్ నార్త్ ఈస్ట్ స్టేట్స్ కల్చర్, ట్రైబ్స్ జీవనవిధానం, సంస్కృతి వంటి వాటిని కథల ద్వారా వివరిస్తాను. మ్యూజిక్, సింగింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో శిక్షణ ఇస్తున్నాను. పిల్లలు పుస్తకాలు చదివేలా తల్లిదండ్రులు కృషి చెయ్యాలి, తల్లిదండ్రులు పుస్తకాలు చదివితే పిల్లలు కూడా చదవడానికి ఆసక్తి చూపిస్తారు. పిల్లలకి చిప్స్, కురుకురే, ఫాస్ట్‌ఫుడ్ కొనే డబ్బులతో చిన్న కథల పుస్తకం కొని చదివేలా చూడాలి. కథల ద్వారా సంస్కృతి, భాషపై పట్టు, బిహేవియర్, మంచి చెడు విచక్షణ తెలుస్తుంది.

– సీతా శ్రీనివాస్, ప్రముఖ కథకులు

మంచి కథలు చెబుతున్నారు..



నేను రెండు సంవత్సరాలుగా వస్తున్నాను. జానపద కథలు, హ్యూమర్ స్టోరీస్, బిహేవియర్ స్టోరీస్ బాగా చెబుతున్నారు. పేపర్ క్రాఫ్ట్ తయారీ నాకు బాగా నచ్చుతుంది. ఈరోజు రంగురంగుల పేపర్‌తో పీకాక్ బొమ్మ తయారు చేశాను. చాలా ఆనందమనిపించింది.

– ఎం.శివప్రకాష్, విద్యార్థి, సీతమ్మధార

కథల ద్వారా కల్చర్...



సీతా మేడం చాలా బాగా కథ చెబుతారు. పాటలు, సౌండ్స్, రిథమ్‌తో మమ్మల్ని కూడా కథలో బాగా ఇన్వాల్వ్ చేస్తారు. కథకు సంబంధించి పేపర్‌తో క్రాఫ్ట్స్ తయారు చేయిస్తారు. డ్రాయింగ్, వర్క్ షీట్స్ చేయిస్తారు. ఎన్నో దేశాలు, రాష్ట్రాలకు చెందిన కథలు చెబుతున్నారు.

– ఎం.ఆద్య, విద్యార్థిని, సీబీఎం కాంపౌండ్



పేపర్‌తో తయారు చేసిన లాంతర్లు చూపిస్తున్న పిల్లలు

ఉత్సాహంగా వీడ్కోలు వేడుకలు



విజేతలతో డాక్టర్ సిస్టర్ షైజీ, జయలక్ష్మి



మాట్లాడుతున్న మనోరంజని

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన వీడ్కోలు వేడుకలు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ నేతృత్వంలో ఉత్సాహంగా జరిగాయి. ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థినులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ముఖ్య అతిథిగా భీమునిపట్నం రెవెన్యూ డివిజన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఆలిస్ మనోరంజని పాల్గొని మాట్లాడారు. అమ్మాయిల్లో విజ్ఞానం సమాజాభివృద్ధికి దోహద పడుతుందన్నారు. కళాశాలను వీడిన తర్వాత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. మానవ విలువల ఆవశ్యకతతో పాటు ఈ పోటీ యుగంలో అన్ని రంగాల్లో మహిళలు ముందుకు వెళ్లాల్సిన అవసరాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. పరీక్షా సమయంలో చదువులకు ప్రాముఖ్యత ఇవ్వాలని కోరారు. వివిధ గ్రూపుల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, డాక్టరేట్ సాధించిన లెక్చరర్లను ఘనంగా సత్కరించారు. విద్యార్థినులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. మిస్ సెయింట్ జోసెఫ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులను సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ హేమ, డాక్టర్ పి.కె.జయలక్ష్మి, డాక్టర్ ఇ. హరిణి, రమణిలత, పావని, డాక్టర్ ప్రవీణ్, పవన్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

సీతంపేట: భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలను ప్రతిపౌరుడు తెలుసుకోవాలని మానవ హక్కుల కౌన్సిల్ కార్యదర్శి మంత్రి శ్యామ్ ప్రసాద్ అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం నిర్వహించిన కౌన్సిల్ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం మనకు ప్రసాదించిన సమానత్వపు హక్కులను కాపాడాల్సిన బాధ్యత హ్యూమన్‌రైట్స్ డిఫెండర్లపై ఉందన్నారు. సీనియర్ న్యాయవాది, కౌన్సిల్ సభ్యుడు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చట్టం ద్వారా మనకు కల్పించబడిన స్వేచ్ఛ, బాధ్యతలు అంటే సమాజానికి సేవ చేయాల్సిన బాధ్యతగా పేర్కొన్నారు. మాజీ పోలీస్ అధికారి సీహెచ్ సత్యనారాయణ మాట్లాడుతూ పౌరులందరికీ సమానత్వపు హక్కు, స్వేచ్ఛా హక్కు, దోపిడీ నుంచి రక్షణ, మత స్వేచ్ఛ, విద్యా హక్కు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.వి.రమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ మతం, భాష సంస్కృతి కాపాడుకునే హక్కు ఉందన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సభ్యులు గుండు అప్పలరాజు, మాజీ పోలీస్ అధికారులు, న్యాయవాదులు పాల్గొని మానవహక్కుల కౌన్సిల్ 26 ఏళ్లుగా చేస్తున్న సేవలను ప్రశంసించారు.



సమావేశంలో పాల్గొన్న వెంకటేశ్వరరావు, శ్యామ్‌ప్రసాద్ తదితరులు

సీఆర్పీఎఫ్ జిల్లా నూతన కమిటీ ఏర్పాటు

సీతంపేట: బాలల హక్కుల పరిరక్షణ ఫెడరేషన్ (సీఆర్పీఎఫ్) జిల్లా నూతన కమిటీ ఏర్పాటైంది. రాష్ట్ర కన్వీనర్ సీహెచ్ విశాలాక్షి అధ్యక్షతన శుక్రవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ సమావేశానికి జిల్లా సెషన్స్ మాజీ జడ్జి విజయసూర్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా నూతన కమిటీ సభ్యులు బాలల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పని చేయాలని సూచించారు. బాలల హక్కుల కోసం రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలను సభికులకు వివరించారు. రాష్ట్ర బాలల హక్కుల కన్వీనర్ గొర్రెపల్లి దామోదర్ ఇన్‌స్టలేషన్ ఆఫీసర్‌గా వ్యవహరించి నూతన కమిటీకి సూచనలు, సలహాలు, విధివిధానాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ వి.సతీష్, జిల్లా ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు ఎల్.ప్రజ్ఞాన్‌కుమార్, నూతన కమిటీ అధ్యక్షుడు మున్నీర్ బాషా, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసమూర్తి, సలహాదారులు డాక్టర్ దుప్పలపూడి దీనబంధు, కార్యదర్శి రామలక్ష్మి, ఎస్.అనూరాధ, హసన్‌రాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.



సీఆర్పీఎఫ్ నూతన కమిటీ సభ్యులతో జిల్లా సెషన్స్ మాజీ జడ్జి విజయసూర్య

సిబ్బంది సంక్షేమానికే ప్రాధాన్యం

పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం: సిబ్బంది సంక్షేమానికి ఎల్లప్పుడు ప్రాధాన్యం ఉంటుందని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. శనివారం ఆయన హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజ్‌పై పోలీస్ సిబ్బందితో పాటు పలు హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలీసు కుటుంబానికి మెడికల్ భద్రత అవసరమన్నారు. ఈ నెల 30లోగా వంద శాతం హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవాలని, అందుకు 24/7 ఇన్సూరెన్స్ సెల్ పని చేస్తుందని తెలిపారు. ఈ సెల్ ద్వారా ఆస్పత్రికి వెళ్లినప్పుడు పేషెంట్‌ను చూసుకుంటే సరిపోతుందన్నారు. ఇన్సూరెన్స్ క్లెయిమ్ పోలీస్ ఇన్సూరెన్స్ సెల్ చూసుకుంటుందన్నారు. అవసరం మేరకు నగర పోలీస్ శాఖ వెల్ఫేర్ ఫండ్ నుంచి కూడా నగదు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కుటుంబ సభ్యులతో చర్చించిన అనంతరం మీకు ఉపయోగపడే ప్లాన్ తీసుకోమని తెలిపారు.

సీతారాముల కల్యాణానికి వేళాయె..

- ఆలయాలకు నవమి శోభ



మురళీనగర్ రామాలయంలో సీతారామలక్ష్మణులు



సీతంపేట పార్వతీశ్వరాలయంలో సీతారాముల ఉత్సవమూర్తులు

సీతంపేట: శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణానికి వాడవాడలా ఘనంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆదివారం అంగరంగ వైభవంగా స్వామివారి కల్యాణం, సోమవారం పట్టాభిషేకం జరపడానికి ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు.

లలితాపీఠంలో..

లలితాపీఠంలో నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణ మహోత్సవంలో భాగంగా శనివారం తిరుమంజన సేవ జరిపారు. ముందుగా గోపూజ, సర్వ దేవతా విశ్వక్సేన ఆరాధన జరిపారు. అనంతరం సీతారాముల ఉత్సవమూర్తులకు తిరుమంజన సేవ నిర్వహించారు. స్వామి వారిని పెళ్లికొడుకుని చేసి, పసుపు దంచి, తలంబ్రాలు కలిపారు. సాయంత్రం పండితుల వేదమంత్రాల మధ్య కల్యాణ మహోత్సవానికి అంకురార్పణ చేశారు. ఆదివారం ఉదయం 9 గంటలకు పీఠం దర్బారుహాల్లో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుందని మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

పార్వతీశ్వరాలయంలో..

సీతంపేటలోని పార్వతీశ్వరాలయంలో ఆదివారం ఉదయం 8 గంటలకు కల్యాణం జరుగుతుందని అర్చకులు గంగవరపు శివాజీశర్మ తెలిపారు. సాయంత్రం 5 గంటలకు మేళతాళాలతో సీతారాముల ఊరేగింపు, సోమవారం ఉదయం 8 గంటలకు శ్రీరామ పట్టాభిషేకం జరుగుతుందని, భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

రాములోరి పెళ్లికి ఏర్పాట్లు..

మురళీనగర్: స్థానిక రామాలయంలో ఉదయం 6.30 గంటలకు విష్ణు సహస్రనామార్చనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.నారాయణరెడ్డి, సనపల వరప్రసాద్ తెలిపారు. 8 నుంచి 9 గంటల వరకు స్వామికి పల్లకీ సేవ జరుగుతుందన్నారు. అర్చకుడు గొడవర్తి రఘురామాచార్యులు ఆధ్వర్యంలో స్థానిక అర్చకులు మంచిలి భానుమూర్తి, అయలూరి రామశాస్త్రి, భోగాపురపు ప్రసాదశర్మతో కూడిన బృందం సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తారన్నారు. మురళీనగర్ మహిళలు అమ్మవారికి సారె తీసుకొస్తారని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు శ్రీరామ పట్టాభిషేకం, దర్బారు సేవ, రాత్రి 9 గంటలకు పవళింపు సేవతో ఉత్సవం ముగుస్తుంది.

వైభవుని సన్నిధిలో..

కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామికి ఉదయాస్తమాన సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహిస్తామని ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. పట్టాభిరెడ్డితోట దాసాంజనేయ స్వామి ఆలయం, మురళీనగర్, ఎన్‌జీజీవోస్ కాలనీ, పట్టాభిరెడ్డితోట, సత్యానగర్, అయ్యప్ప నగర్ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొనేందుకు వీలుగా భారీ వేదిక నిర్మించారు. పట్టాభిరెడ్డి వానప్రస్థ వృద్ధాశ్రమంలో శ్రీరామ నవమి వేడుకలకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకుడు శ్రీనివాసరావు తెలిపారు.

పదోన్నతి కల్పించాలని వినతి

అల్లిపురం: వార్డు ఎడ్యుకేషనల్ సెక్రటరీలకు ప్రమోషన్ కల్పించి, సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సచివాలయ విద్యా కార్యదర్శులు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను కోరారు. ఈ మేరకు వారు శనివారం అతన్ని టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు విద్యా కార్యదర్శులకు మెరుగైన బేసిక్ పేతో, ప్రమోషన్ కల్పించాలని, ఇంక్రిమెంట్లు తదితర సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లా కిరణ్‌కుమార్ యాదవ్, నాయకులు మొకర శ్రావణ్‌కుమార్, కొలిమెల్ల సురేష్‌కుమార్, రాజా, బంగారునాయుడు, హరి, అబ్దుల్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ అధ్యక్షుడు మూర్తికి సత్కారం

సీతమ్మధార: త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయం అధ్యక్షుడు టి.ఎస్.ఎన్.మూర్తికి వరల్డ్ కల్చర్ అండ్ ఎన్విరాన్ మెంట్ ప్రొటెక్షన్ కమిషన్ (న్యూఢిల్లీ) గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసిన సందర్భంగా జీవీఎంసీ 14వ వార్డు గణేష్‌నగర్‌లోని ఆలయంలో అయనను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి ప్రకాష్‌రావు, గొర్లె కృష్ణ, టి.వెంకటరావు, కర్రి రామిరెడ్డి, పి.వి.రమణ, పి.ముత్యాలరావు, మాదేటి సత్యనారాయణ, సీహెచ్ లక్ష్మణరావు, లక్ష్మి, సరోజిని, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మూర్తిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సదరం కోసం పడిగాపులు

మహారాణిపేట: సదరం స్లాట్ బుకింగ్ చుక్కలు చూపిస్తోంది. ఇటీవల ప్రభుత్వం సదరం స్లాట్ సిద్ధంగా ఉంటుందని ప్రకటన జారీ చేసింది. దీంతో పలువురు దివ్యాంగులు, ఇతరులు సచివాలయాలకు చేరుకున్నారు. అయితే ఎక్కడా సదరం స్లాట్ ఓపెన్ కాలేదు. సర్వర్ల సమస్య అంటూ సచివాలయ అడ్మిన్లు, ఇతర సిబ్బంది చెప్పుకొచ్చారు. శుక్ర, శని వారం సదరం స్లాట్ అందుబాటులో లేకుండా పోయింది. ఉదయం పది దాటినా ఎక్కడా సర్వర్ అందుబాటులోకి రాలేదు. దీంతో దివ్యాంగులు సచివాలయ కేంద్రాల వద్ద మధ్యాహ్నం 12 గంటల వరకు పడిగాపులు కాశారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న రామచంద్రప్రసాద్ తదితరులు

సీతమ్మధార: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఆవరణలో శనివారం ఉదయం జరిగిన కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. రామచంద్ర ప్రసాద్, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్లు జె. శ్రీనివాసరావు, డి. సుమన్ కళ్యాణి, బి. అశోక్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.